RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 201 | జులై 06, 2025 | వెల : రూ.3-00



తైక్వాండో చాంపియన్స్‌కు అభినందన

4లో..

# పెనుముప్పుపై నిర్లక్ష్యం వద్దు!



- పూర్తి జీవావరణానికి పొంచిన ప్రమాదం
- ఎల్లబండ వద్ద బ్లాస్టింగులను అడ్డుకోవాల్సిందే
- ధర్మసాగర్ రిజర్వాయర్ రక్షణపై పట్టింపులేదా?
- 18 కి.మీ. వ్యాసార్థం మేర తీవ్ర ప్రకంపనలు
- మానవుడితో పాటు జీవరాశి ఆరోగ్యానికి డేంజర్
- దుమ్ము వ్యాప్తితో గణనీయంగా దిగుబడి తగ్గుముఖం
- ప్రకృతిని రక్షిస్తేనే భూమ్మీద జీవకోటికి మనుగడ

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల పరిధిలో ఉన్న ధర్మసాగర్ ఎత్తిపోతల పథకం ఓరుగల్లు ప్రజానీకానికి తాగునీరు, రైతాంగానికి సాగు నీరు అందించడంలో అత్యంత కీలకమైనది. రిజర్వాయర్‌కు చుట్టు పక్కల ఉన్న గుట్టలు ఆనకట్ట మాదిరిగా అడ్డుగా ఉండి రిజర్వాయర్‌కు రక్షణకవచంలా ఉంటున్నాయి. కాగా, ఆ రక్షణ వలయానికి తూట్లు పొడుస్తున్నారు. క్వారీలు, క్రషర్లకు అధికారులు అనుమతులు ఇస్తుండటంతో గుట్టలను కొందరు తమ స్వార్థానికి గుటుక్కు మనిపిస్తున్నారు. బాంబులతో పేల్చివేస్తున్నారు. ప్రభుత్వానికి ఆదాయమార్గంగా అధికారులు క్వారీలకు అనుమతిస్తున్నారు. కానీ, పేల్చివేతలు ఈ రీతినే కొనసాగితే.. సమీప భవిష్యత్తులో ఆ ప్రాంత పరిధిలో జీవావరణం దెబ్బతిని పెను ముప్పు పొంచి ఉన్నదని పర్యావరణవేత్తలు, నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధికారులు క్వారీ, క్రషర్ల పర్మిషన్లను రద్దు చేయాలని, అక్రమాలకు సపోర్టుగా నిలుస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**- పేల్చివేతలతో భూమి లోపల ప్రకంపనలు**

రిజర్వాయర్‌ను ఆనుకుని ఉన్న క్వారీలు, క్రషర్లలో పేల్చివేతలతో తీవ్రమైన ముప్పు త్వరలో ఉండబోతున్నదని పర్యావరణవేత్తలు వివరిస్తున్నారు. జిలెటిన్ స్టిక్స్‌తో పేలుళ్లను కనీస రక్షణ చర్యలు చేపట్టకుండానే నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. కాగా, ఆ పేలుళ్ల వల్ల భూమి లోపల ప్రకంపనలు 18 కి.మీ. వ్యాసార్థం వరకు ఉంటాయని నిపుణులు వెల్లడిస్తున్నారు. సమీపంలోని ఇనుపరాతి గుట్టల్లో ప్రకతి, జీవావరణం దెబ్బతింటుందని, అడవీ జంతువులు ఆవాసం కోల్పోయి ఇండ్లలోకి వచ్చే చాన్సెస్ ఉంటాయని పేర్కొంటున్నారు. పర్యావరణవేత్తలు, నిపుణుల అభిప్రాయం ప్రకారం.. పేలుళ్ల తర్వాత వచ్చే దుమ్ము పంటపొలాల్లో చేరి పంట దిగుబడి గణనీయంగా తగ్గనుంది. భూమి సాగుకు 'ప్రతికూలంగా' మారుతుంది. దుమ్ము క్రమంగా గాలితో కలిసి కి.మీ.

మిగతా 3వ పేజీలో..



## అవయవ దానంపై అవగాహన పెరగాలి



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

అవయవ దానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని మరొక వ్యక్తికి పునర్జన్మను ఇవ్వడానికి జీవన్ దాన్ మహాదానమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శనివారం తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ శాఖ, టీ9 ఛానల్ సంయుక్త ఆధ్వర్యంలో వరంగల్ పట్టణంలోని ఆబ్నూస్ ఫంక్షన్ హాల్ లో నేత్ర అవయవ శరీర దానం పై ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ముఖ్య అతిధిగా పాల్గొని, అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్

మిగతా 4వ పేజీలో..

## మాజీ సీఎం బాటలోనే ప్రస్తుత సీఎం..!

**వేద న్యూస్, శంకరపట్నం :**



తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నడిచిన బాటలోనే ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడుస్తున్నాడని, సామాజిక కార్యకర్త, సీనియర్ జర్నలిస్ట్ కోరుమి వెంకట స్వామి ఆరోపించారు. మండల కేంద్రంలో శనివారం రోజున ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 16 నెలలు గడుస్తున్నా కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా జాబ్ క్యాలెండర్ ను ప్రకటించకపోవడం ఎంత వరకు సమంజసం?అని, ఇస్తానన్న రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడ? అంటూ ప్రశ్నించారు. ఇలా అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన మూడున్నర ఇళ్లలో ముగుస్తుందని కూడా అన్నారు. బిఆర్ఎస్ పార్టీ గతంలో నిరుద్యో గులకు ఏమి చేయలేదని, ఇప్పుడు ఈ పార్టీ కూడా నిరుద్యోగుల పక్షాన చిన్నచూపు చూస్తుందని తెలుపుతూ, ఇప్పటికైనా జాబ్ క్యాలెండర్ ను ప్రకటించి రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు బాసటగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

## బీరన్న బోనాలకు ఘన చరిత్ర

- గావు పట్టే ఘట్టం ప్రత్యేకం
- శతాబ్దాల హిస్టరీ కలిగిన ఫెస్టివల్
- ప్లేగు వ్యాధిని 'బీరన్న' నివారించారని భక్తుల విశ్వాసం
- నేడు వైభవంగా తొలిఏకాదశి బోనమెత్తనున్న 'కరీమాబాద్'





**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేకమైన పండుగలలో బోనాలు ఒకటి. ఇది ముఖ్యంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఘనంగా జరుపుకుంటారు. శివ కేశవులు విష్ణుకు ప్రీతికరమైన రోజు ఉపవాసాల వ్రతాలు ప్రారంభమయ్యే శుభదినం పండుగలకు స్వాగతం పలికే రోజు 'తొలి ఏకాదశి'. ఆషాఢ మాసంలో వచ్చే శుక్లపక్ష ఏకాదశిని 'తొలి ఏకాదశి' అంటారు. దీనినే 'శయన ఏకాదశి' అని కూడా పిలుస్తారు. తొలి ఏకాదశి సందర్భంగా వరంగల్ కరీమాబాద్ లో కురుమ కులస్తులు బీరప్ప కామరతి, అక్క మహంకాళి దేవతమూర్తులకు బోనాలు సమర్పించనున్నారు.

**- అమ్మవారికి ప్రత్యేకపూజలు**

రామస్వామి గుడి నుంచి బురుజు సెంటర్ మీదుగా ఒగ్గుడోలు కళాకారుల వాయిద్యాలు..శివాసత్తుల నృత్యాలు..బీరన్నల విన్యాసాలు మధ్య వందలాది మంది మహిళలు బోనలతో పాటు పట్టువస్త్రాలతో బీరప్ప ఆలయానికి చేరుకుంటారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి బోనం నైవేద్యం సమర్పించిన అనంతరం పట్టు వస్త్రాలు కానుకగా ఇచ్చి ఒడిబియ్యం పోస్తారు.

**- వైభవోపేతంగా వేడుకలు**

వరంగల్ కరీమాబాదులో ఆషాడ మాసం 'తొలి ఏకాదశి' సందర్భంగా నిర్వహించే బోనాలకు శతాబ్దాల చరిత్ర కలిగిన బీరన్న బోనాలు. శతాబ్ద క్రితం ప్లేగ్ వ్యాధి పుట్టి ప్రజలు చనిపోతుండగా వారు బీరన్న స్వామిని ప్రార్థించి ఇలా మొక్కారు. ఈ వ్యాధిని నివారిస్తే నీకు బోనం సమర్పిస్తాము. ఆ తర్వాత ప్లేగ్ వ్యాధి తగ్గిపోయిందన్న విశ్వాసంతో బోనాలు సమర్పించడం ప్రారంభించారు. అప్పటినుండి ఏటేటా వైభవంగా కొనసాగుతోంది.

**- ఆలయంపై జాతీయ జెండా ప్రతిష్ట**

వర్షాలు పడక పొలాల పొడబారిపోయాయి రైతులు నిస్సాయంగా మారారు అలాగే ప్లేగ్ వ్యాధి

మిగతా 3వ పేజీలో..



# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ





**వేద న్యూస్, శాయంపేట:**

ఆపదలో సీఎం సహాయనిధి ఆపద్బాంధవునిలా ఆదుకుంటుందని భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ రావు అన్నారు. శనివారం భూపాలపల్లి నియోజకవర్గంలోని శాయంపేట మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 23 మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు రూ.6,84,500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే మండల కేంద్రంలోని రైతు వేదికలో అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. సీఎం సహాయనిధి ద్వారా పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు.మానవతాదృక్పథంతో సీఎం రేవంత్ రెడ్డి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ప్రైవేటు, కార్పోరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరగా నిలుస్తుందన్నారు. బాధితులకు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ను తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ నేతలు చల్ల చక్రపాణి, మారపెల్లి రవీందర్ దూదిపాల బుచ్చిరెడ్డి , చిందం రవి, బాసాని మార్కండేయ , బాసాని రవి, మారపల్లి రాజు, చింతల రవిపాల్,మారపెల్లి రాజేందర్, యూత్ మండల నాయకులు సాదు నాగరాజు, విష్ణు, పీటర్ కార్యకర్తలు, ప్రజలు ఉన్నారు.

# వెంటనే నూతన వేతన సవరణ చేయాలి.!

**వేద న్యూస్, శంకరపట్నం :**



ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కు సంబంధించిన నూతన పీఆర్సీ (వేతన సవరణ ) - 2023 తక్షణమే ప్రకటించి, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని,తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ.ఖాద్రీ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖాద్రీ మాట్లాడుతూ, 01-జులై -2023 నుండి ప్రకటించాల్సిన పీఆర్సీ రెండు సంవత్సరాల కాలం గడిచిన నేటికీ జాడ లేకుండా పోయిందని, గత పీఆర్సీ లో ఉద్యోగ, ఉపాధ్యాయులు 12 నెలల బకాయిలు నష్టపోయారు, మరియు 21 నెలల బకాయిలు పదవీ విరమణ పొందిన అనంతరం ఇస్తామనడం, గత్యంతరం లేని పరిస్థితుల్లో ఒప్పుకోవడం జరిగిందని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రెండవ పీఆర్సీ కోతలు లేకుండా కడుపు నిండా 01-జులై -2023 నుంచి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రోజులు గడిచేకొద్దీ ఉద్యోగుల్లో అభద్రతా భావం, ఆందోళనలకు గురి అవుతున్నారు. పెండింగ్ డీఏలు, సప్లిమెంటరీ బిల్లులు, సరెండర్, జీ పీ ఎఫ్ బిల్లులపై వెంటనే ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలపైన తగు నిర్ణయాలు తీసుకోని అమలు చేయాలని అన్నారు.

గత పీఆర్సీ అమలుకు 33 నెలల కాలం పట్టింది, ఆ పరిస్థితులు తిరిగి పునరావృతం కాకుండా వెంటనే నూతన వేతన సవరణ చేయాలని అన్నారు. ఆదేశాలు ఇచ్చి నూతన వేతన సవరణ కమీషన్ సిఫార్సులను తెప్పించి ఉత్తర్వుల ద్వారా 01-జులై -2023 నుంచి అమల్లోకి తీసుకు రావాలని కోరారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలపై దృష్టి సారించి సగటు ఉద్యోగికి లాభం చేకూరేలా ప్రభుత్వం చూడాలని విజ్ఞప్తి చేశారు

# విలేకరి

సమస్త మానవాళి మనుగడ కోసం
నీ ప్రాణాలను పన్నంగా పెట్టీ ఉద్యోగం చేస్తున్న
వీరుడా ఓ విలేకరి అందుకో మా అభినందనలు..!
పెరుకపోయిన అంతుచిక్కని సామాజిక రుగ్మతలను పెన్నుతో నయం చేసిన సామాజిక వైద్యుడా ఓవిలేకరి అందుకో మా అభినందనలు..!
దోపిడి దౌర్జన్యాలను కలంతో అతంచేసి
ప్రజా మన్నలను పొందిన ధైర్యవంతుడా
ఓ విలేకరి అందుకో మా అభినందనలు..!
మహిళలపై జరగుతున్న ప్రతీ సంఘటనలను
కలంతో సమాజం ముందు వుంచుతు,
వీరనారీమణుల జీవిత చరిత్రను తెలుపుతూ
మహిళలో ధైర్యసాహసాలు నింపిన ఆత్మీయుడా ఓవిలేకరి అందుకో మా అభినందనలు..!
అహర్నిశలు సమాజం కోసం కష్టపడే మీరు
ఆయురారోగ్యాలతో పదికాలాలపాటు సంతోషంగా ఉండాలని మంచి రోజులు
రావాలని కోరుకుంటూ...



**మంజుల పత్తిపాటి,**
**మాజీ డైరెక్టర్,**
**ఆలేరు వ్యవసాయ**
**మార్కెట్ కమిటీ,**
**యాదాద్రి భువనగిరి జిల్లా,**
**తెలంగాణ రాష్ట్రం,**
**చరవాణి 9347042218.**


# పచ్చదనం ప్రగతికి సోపానం




**వేద న్యూస్, కరీంనగర్ :**

ప్రస్తుత కాలంలో ఎక్కడ చూసినా చెట్లను నరికివేయడం జరుగుతుంది. ఈ ప్రక్రియ వల్ల వాతావరణంలో చాలా మార్పులు సంభవిస్తున్నాయి. జూలై 05 గ్రీనరీ డే సందర్భంగా కరీంనగర్ పట్టణం అశోక్ నగర్ లో ఎస్ ఆర్ డీజీ స్కూల్ లో గో గ్రీన్ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పండ్లు మరియు పూల మొక్కలు నాటారు. వారు పచ్చదనాన్ని పెంచడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకున్నారు. అనంతరం ఎస్ ఆర్ స్కూల్స్ జోనల్ ఇన్‌ఛార్జ్ శశిధర్ మాట్లాడుతూ మనం పచ్చదనాన్ని పెంచితే, ఎలాంటి వ్యాధులను అయినా నివారించవచ్చు. అంతే కాకుండా ఆక్సిజన్ స్థాయి పెంచగలుగుతాము. కాబట్టి ప్రతి ఒక్కరు మొక్కను నాటడం మంచిది అని అన్నారు. చెట్లను మానవాళి పెంచినట్లయితే మనకు చాలా ప్రయోజనాలను అందిస్తాయి. ఫలాలను ఇస్తాయి మరియు ఆ పండ్లు తినడం వల్ల మన శరీరానికి ఆరోగ్యం లభిస్తుందని మరియు గాలిలో ఆక్సిజన్ పెరుగుతుంది. ఇది మనల్ని ఆరోగ్యవంతులుగా చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మానస, విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# ఆర్ఎంపీ క్లినిక్‌లు ఆకస్మిక తనిఖీ



**వేద న్యూస్, మెట్ పల్లి ప్రతినిధి :**

జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండల వైద్యాధికారి ఎల్లాల అంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో మెట్ పల్లి పట్టణ పరిధిలోని ఆర్ఎంపీల క్లినిక్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అంజిత్ రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎంపీలు పరిధిని దాటి వైద్యం చేయకూడదని రోగులకు సలైన్లు పెట్టడం, ఇంజక్షన్లు చేయడం, అతిగా అనవసరమైన ఆంటీబయాటిక్ లాంటి మాత్రలు వినియోగించి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడకూడదని, రోగులకు ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని క్లినిక్ బోర్డుల పైన ప్రథమ చికిత్స కేంద్రము అని మాత్రమే ఉండాలని అన్నారు. ఆర్ఎంపీలు తమ పరిధి దాటి చికిత్స అందించినట్లయితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అంజిత్ రెడ్డి అన్నారు. ఈ తనిఖీల్లో సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పోటీలకు సేయింట్ అన్స్ విద్యార్థులు

**వేద న్యూస్, మఠంపల్లి :**



ఈనెల 4వ తారీఖున సూర్యాపేటలోని ఎస్వీ డిగ్రీ కళాశాల నందు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ వారు నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ 10,12,14 స్థాయిలలో బాల బాలికలకు నిర్వహించిన 60 మీటర్ల పరుగు పందెంలో సెయింట్ ఆన్స్ హై స్కూల్ విద్యార్థులు ప్రత్యేక ప్రతిభను కనబరిచారు.అందులో జి. నిఖిల అండర్ 10 టి ప్రశాంతి, అండర్ 12 ఎస్ కే. నాజియా, అండర్ 14 లలో 60 మీటర్ల పరుగు పందెం,లాంగ్ జంప్, హై జంప్ ల యందు ప్రతిభను కనబరిచారు. జూలై ఆరవ తారీఖున హనుమకొండ లో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎస్కే నాజియా మరియు టీ ప్రశాంతి ఎంపిక కావడం జరిగినది ఎంపిక అయిన విద్యార్థులకుపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సబీన, కరస్పాండెంట్ సిస్టర్ రూబీ, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియజేసినారు.

# ఘనంగా గ్రీన్ ఇండియా కార్యక్రమం

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట :**



ఎల్లరెడ్డిపేట మండల కేంద్రంలోనీ స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో గ్రీన్ ఇండియా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా ఎల్లారెడ్డి పేట ఎస్సై రాహుల్ రెడ్డి పాల్గొని విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో పండ్ల మొక్కలు ,పూల మొక్కలు నాటారు.ఈ సందర్భంగా రాహుల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన ఇంటి ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడానికి మొక్కలు ఎంతగానో దోహదపడతాయని పాఠశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏ.జీ.ఎం. ముద్ర కోల రాజు ,ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ నూరి, గడిఎన్ రవీందర్ సి బ్యాచ్ ఇన్చార్జి ఓదేలు, ఇన్చార్జి లు దివ్య, పూర్ణిమ , ఏ.వో శేఖర్ పి.ఈ.టి. బాపురెడ్డి ,ఉపాధ్యాయులు ప్రశాంత్, కల్పలత, మహేష్ ,మమత మరియు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


# కుడా వైస్ చైర్మన్‌గా చాహత్ బాజ్‌పాయ్



**వేద న్యూస్, హన్మకొండ :**

కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ (కుడా) వైస్ చైర్మన్ గా చాహత్ బాజ్ పాయ్ శనివారం హన్మకొండ లోని కుడా కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టారు. బల్దియా కమిషనర్ గా కొనసాగుతున్న చాహత్ బాజ్ పాయ్ ను కుడా వైస్ చైర్మన్ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన తరుణంలో పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కుడా అధికారులు, సిబ్బంది వైస్ చైర్మెన్ కు పుష్పగుచ్ఛాలు పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# బ్రెయిన్ స్ట్రోక్‌తో ఇంటర్ విద్యార్థిని మృతి



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట :**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఇంటర్ విద్యార్థిని సాత్విక బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందింది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన విశ్వనాథుల పూర్ణచందర్ కవిత ల కూతురు సాత్విక అనారోగ్యానికి గురి కావడంతో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చిచికిత్స చేయిస్తుండగా బ్రెయిన్ స్ట్రోక్ కు గురై మృతి చెందింది.సమాచారం అందుకున్న ఎల్లారెడ్డిపేట సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి ఆసుపత్రికి వెళ్లి విద్యార్థిని తల్లి దండ్రులను ఓదార్చారు.

## సంపాదకీయం

### ప్రజాస్వామ్యంలో చర్చలకు తావు లేదా?

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా మన దేశానికి ఒక గుర్తింపు, గౌరవం ఉన్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కావడంతో ప్రజల భాగస్వామ్యం ప్రతి దశలోను ఉంటుంది. ఏకపక్ష నిర్ణయాలు లేకుండా ప్రతిపణాల సలహాలు, సూచనలు పరిగణనలోనికి తీసుకొని ప్రజలను కూడా కలుపుకొనిపోయే ప్రజాస్వామ్యబద్ధమైన పాలన, ఒక సామరస్య సుహృద్భావ వాతావరణంలో జరుగుతూ ఉంటుంది. ప్రజాస్వామ్యంలో చర్చలు కీలక పాత్ర వహిస్తాయి. దేశంలో ఈ మే నెల నాటికి మణిపూర్ మారణ హోమానికి రెండేళ్లు నిండింది. కుకీ మెయితీ జాతుల మధ్య వైరంగా పరిణమించిన రిజర్వేషన్ల సమస్యను అటు రాష్ట్ర ప్రభుత్వం ఇటు కేంద్ర ప్రభుత్వం పరిష్కరించకపోగా, దాదాపు 300 మంది మరణించినా చేష్టలుడిగిన ప్రభుత్వాలు ప్రేక్షక పాత్ర వహించాయి. చర్చలు జరిపే ప్రయత్నం ఏమాత్రం చేయలేదు. చివరికి ముఖ్యమంత్రి బైరాన్ సింగ్ తప్పుకుంటే రాష్ట్రపతి పాలన విధించారు. ప్రధాన మంత్రి మాత్రం ఏనాడు మణిపూర్ గురించి పార్లమెంటులో మాట్లాడడానికి ఇష్టపడ లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ పోరాటం చేస్తున్న జాతులతో చర్చలు జరపడానికి ఇష్టపడలేదు. సరిహద్దు దేశమైన పాకిస్తాన్ ఉగ్రవాదులు ఏప్రిల్ నెల చివరలో జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో టూరిస్టులను మతం (%శీబతీఱర్ం తీవశ్రీఱస్త్రఱశీబం%) పేరుతో కాల్చి చంపారు. యావత్ ప్రపంచం ఉలిక్కిపడి పాక్ దుశ్చర్యను ఖండించింది. అందుకు భారత ప్రభుత్వం కూడా వెంటనే ప్రతిస్పందించి ఆపరేషన్ సిందూర్ పేరుతో ప్రతీకారం తీర్చుకుంది. శత్రుదేశంపైన పైచేయిగా ఉండి కూడా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనవసర జోక్యంతో భారత్ కాల్పుల విరమణ చేసింది. దానిపై అనేక విమర్శలు వచ్చినా మోడీ ప్రభుత్వం జవాబు చెప్పలేదు. పాకిస్తాన్‌ను మోకాళ్ళ మీద నిలబెడతామని గొప్పలు పోయింది. కానీ ఏమి సాధించారో చెప్పుకోలేక పోయింది. 27 మంది విలువైన ప్రాణాలు పోకుండా కాపాడు కోలేకపోవడం ముఖ్యంగా సరిహద్దు రాష్ట్రమైన జమ్మూకశ్మీర్‌లో కచ్చితంగా భద్రతా బలగాల వైఫల్యమే. ప్రాణానికి ప్రాణం సమాధానం కాదు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను సాధించేవరకు విశ్రమించేది లేదన్న మోడీ హఠాత్తుగా కాల్పుల విరమణ ప్రకటించడం ఆశ్చర్యకరం. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన ఘనతగా చెప్పుకుంటున్నాడు. కాల్పుల విరమణ ఎందుకు చేయవలసి వచ్చిందో మోడీ ప్రభుత్వం ఈనాటి వరకు చెప్పుకోలేకపోయింది. పార్లమెంటు సమావేశాలు జరపాలన్న డిమాండ్ కూడా తిరస్కరించింది. ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దండకారణ్యాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే పనిలో భాగంగా అక్కడ ఉన్న మావోయిస్టులను అనేక మందిని ఎన్‌కౌంటర్ పేర కాల్చి చంపి వారికి మద్దతుగా ఉన్న అమాయక ఆదివాసీలను కూడా పొట్టన పెట్టుకుంది. నేడు మోడీ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి 2026 మార్చి నాటికి దేశంలో మావోయిస్టుల జాడలేకుండా చేస్తామని కంకణం కట్టుకొని అనేక దఫాలుగా కాల్పులు జరుపుతూ మావోయిస్టులను ఏరివేస్తున్నది. ఈ సందర్భంగా మావోయిస్టులు ఒక శాంతి చర్చల ప్రతిపాదన చేయగా లటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు కేంద్ర ప్రభుత్వం దానిని పరిగణించకుండా ఏకపక్షంగా అడవులలో కాల్పులు జరుపుతూనే ఉంది.ఒక రకంగా చెప్తే మావోయిస్టులు అస్త్ర సన్యాసం చేయగా కేంద్ర ప్రభుత్వమే ఒంటరిగా యుద్ధం చేస్తున్నట్లు ఉన్నది. ఈ యుద్ధం ఎవరి కోసం జరుగుతున్నదో సగటు భారతీయుడికి బోధపడడం లేదు. మావోయిస్టులను తుద ముట్టించిన బలగాలను కేంద్ర హోం మంత్రి అభినందించడం విడ్డూరం.ఇది సిద్ధాంతం పైన యుద్ధమా లేక వ్యక్తులతోనా అనేది అర్థం కావడం లేదు. వేల కొద్ది మావోయిస్టులను మట్టుపెట్టారు. ప్రజాస్వామ్యంలో ఆయుధానికి తావు లేదు. హింసకు స్థానం లేదు.

మావోయిస్టులకు ప్రజాస్వామ్యంపై చర్చ నమ్మకం ఉందా లేదా అనేది మరో చర్చ. కానీ ప్రజాస్వామిక ప్రభుత్వం చర్చలను ప్రతిపాదించకపోయినా కనీసం చర్చలకు అంగీకరిస్తే తన పెద్దరికాన్ని, ఔన్నత్యాన్ని నిలబెట్టుకునేది. దేశంలోనే వామపక్షాలు, మేధావులు ఈ చర్చలను స్వాగతిస్తుండగా, కేంద్ర ప్రభుత్వం ససేమిరా అంటూ యుద్ధం చేయడం వెనుక దానికున్న ప్రయోజనాలు మనం ఆలోచించాలి. కేవలం అడవుల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయడం కోసమే. అందుకు అడ్డుగా నిలుస్తున్న మావోయిస్టులపై కక్ష కట్టింది కేంద్ర ప్రభుత్వం. మావోయిస్టుల సమస్యను శాంతి భద్రతల సమస్యగా కాకుండా రాజకీయ, సామాజిక కోణంలో ఆలోచించలేకపోవడమే ఇందుకు కారణం. కేంద్ర ప్రభుత్వమే చొరవ చూపి చర్చల ప్రక్రియకై తెరలేపితే దేశంలోని ప్రజలందరూ స్వాగతించేవారు, అభినందించేవారు.మావోయిస్టు రహిత దేశం, మావోయిస్టులు ఎక్కడున్నా ఏరివేస్తాం లాంటి ప్రకటనలు, నినాదాలు కాదు ప్రజలకు కావలసింది. ఇవేమీ వారి పొట్టనింపవు. ఆదివాసీల ఆకలి తీర్చవు. శాంతి చర్చల్లో మావోయిస్టు ఎజెండా చర్చించి కేంద్ర ప్రభుత్వం తన విధానాల ద్వారా ఏ రకంగా వాటిని అమలు పరుస్తున్నదో వివరించవచ్చు. వారిని ఒప్పించవచ్చు. ఇటు ప్రభుత్వం అయినా అటు మావోలైనా ప్రజలు ముఖ్యంగా ఆదివాసీల సంక్షేమం కోసమే పని చేస్తున్నప్పుడు సంఘర్షణకు తావులేదు. అందుకు ఒప్పుకోని ప్రభుత్వానికి ఇతర ప్రయోజనాలు ఉన్నాయన్నది స్పష్టం.లక్షల కోట్ల రూపాయలు విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికే అనేది జగమెరిగిన సత్యం. అడవిని నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలు నిరాశ్రయులవుతారు. భవిష్యత్తులో పర్యావరణ సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉంది. వేల మంది బలగాలను దింపి దండకారణ్యంపై నలువైపులా దాడి చేసి పిడికెడు మంది మావోయిస్టులకు స్థానం లేకుండా చేస్తున్నది. ఇందులో బలయ్యేది అమాయక ఆదివాసీలే. వారు దిక్కు తోచని స్థితిలో బిక్కుబిక్కుమంటూ తమ స్థావరాలను కాళీ చేయడం గమనార్హం. ఒకప్పుడు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ బిడి శర్మ వారి జీవితాల్లో ఎంతో మార్పు కోసం తాను ఎన్నో అవమానాల పాలయ్యాడు. భూస్వాముల నుండి, ప్రైవేట్ కంపెనీల నుండి అడవులను, వాటిలోని ఖనిజ సంపదను కాపాడడంలో సఫలమయ్యాడు.అదివాసులకు అనుకణం అండగా నిలిచాడు. కానీ రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూలు పాలక వర్గాల వైపు నేడు నిస్సహాయంగా చూస్తూ ఉంది.

# చట్టసభలకు వన్నెతెచ్చిన నేత ఓంకార్

**- ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరో సభ్యుడు ఉపేందర్‌రెడ్డి - ప్రజాస్వామ్య, పౌరహక్కుల పరిరక్షణకు ఉద్యమించాలని పిలుపు**

**వేద న్యూస్, జమ్మికుంట:**



ప్రజా సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు తన గళమెత్తి చట్టసభలకు వన్నెతెచ్చిన నేత, నేటి తరానికి ఆదర్శనీయులు కామ్రేడ్ ఓంకార్ అని ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరో సభ్యుడు ఉపేందర్‌రెడ్డి అన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలోని కొత్తపల్లిలో 'పౌరహక్కుల పరిరక్షణ-ఓంకార్ పాత్ర' అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో పౌరహక్కుల పరిరక్షణకు ఓంకార్ ప్రజాపోరాటాలు చేశారని చెప్పారు. పౌరుల ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు గురైనపుడు హక్కుల పరిరక్షణకు నడుం బిగించి ఉద్యమాలు చేశారని వెల్లడించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎమర్జెన్సీ కాలంలో ఆనాటి సీఎం జలగం వెంగళరావు హయాంలో ఎన్‌కౌంటర్ల పేరుతో అనేక మంది నక్సలైట్లను కాల్చి చంపారని వివరించారు. అందులో పోట్ల రామనర్సయ్యను అక్రమంగా నర్సంపేట పాకాల అడవులలో చిలుకలగట్టు గుట్టకు తీసుకెళ్లి చంపేశారని, ఖమ్మం అడవులలో సుమారు 200 మంది యువకులను కాల్చి చంపేశారని పేర్కొన్నారు. ఆ సందర్భంలో పుచ్చలపల్లి సుందరయ్య, ఓంకార్ అసెంబ్లీలో ఈ విషయాలు లేవనెత్తారని గుర్తుచేశారు. నక్సలైట్ల సిద్ధాంతాలు, విధానాలు వేరైనంత మాత్రాన మనుషులను పట్టుకొని కాల్చి చంపే హక్కు మీకెవరిచ్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గవర్నర్ ప్రసంగంపై శాంతిభద్రతలపై చర్చకు పట్టుబట్టి వాదించి బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపిన ఘటనపై విశ్రాంత న్యాయమూర్తి భార్గవతో కమీషన్ వేయించి, సదరు కమిటీ ముందు సాక్షులను తీసుకొచ్చి సాక్ష్యం ఇప్పించడంలో ఓంకార్ కీలకపాత్ర పోషించారని స్పష్టం చేశారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ సర్కారు పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను ఉపయోగించి అక్రమంగా ప్రతిపక్ష పార్టీ నాయకులను జైళ్లలో పెడుతున్నదని విమర్శించారు. అర్బన్ నక్సలైట్లని, టెర్రరిస్టులని రకరకాల పేర్లతో జైళ్లలో పెడుతూ, బూటకపు ఎన్‌కౌంటర్లతో మారణ కాండ చేస్తోందని ఆరోపించారు. అడవిలో మూలవాసులైన ఆదివాసీలను కాల్చి చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ సంపద కార్పొరేట్ పెట్టుబడిదారులకు కట్టబెట్టుటకు, దోచి పెట్టుటకు అనేక కుట్రలు చేస్తున్నారని పేర్కొన్నారు. కామ్రేడ్ ఓంకార్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా జూన్ 12 నుంచి జూలై 11 వరకు ఓంకార్ చూపిన మార్గంలో ప్రజాస్వామ్య, పౌరహక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంసీపీఐ (యూ) ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి గడ్డం శ్రీకాంత్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైక్య రాష్ట్ర కమిటీ సభ్యురాలు వి.సరోజన, పిట్టల తిరుపతి, మదనయ్య, పిట్టల సుజాత, స్వర్ణలత, కళావతితో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెనుముప్పుపై నిర్లక్ష్యం వద్దు!

మొదటి పేజీ తరువాయి

మేర వ్యాపించి మనుషుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. భూగర్భజలాల తమ దారి మార్చుకుని నీటి ఊటలకు ప్రమాదం పొంచి ఉంది. వ్యవసాయ దిగుబడి క్రమానుగతంగా గణనీయంగా తగ్గనుంది. దుమ్ము వచ్చి పత్తి, పొగాకు, ఇతర పంటల ఆకులు, కాండం, చెట్లపైన పడటం ద్వారా మొక్కలకు అత్యావశ్యకమైర కిరణజన్యసంయోగ క్రియకు అవకాశం ఉండబోదు. ఫలితంగా పంట దిగుబడి ఊహించిన దాని కంటే చాలా తక్కువగా వస్తుంది. సాయిల్(భూమి) సాంద్రత, నాణ్యత తగ్గుముఖం పడుతుంది. కర్బనలోపం ఏర్పడి భూమి సాగుకు అననుకూలంగా మారి రైతును వ్యవసాయానికి దూరం చేసే పరిస్థితి ఏర్పడుతుంది. జలం, జంతుజాలానికి, వాటి ఆవాసాల మనుగడకు ప్రమాదం పొంచిఉన్నది.

**- మనుషుల ఆరోగ్యంపైన తీవ్రప్రభావం**

బాంబు బ్లాస్టింగ్ వల్ల వచ్చే దుమ్ము క్రమంగా గాలితో కలిసి కి.మీ. మేర వ్యాపించి మనుషులపైన తీవ్రప్రభావం చూపుతుంది. దుమ్ము ద్వారా మనుషుల దృశ్యమానత (విజిబిలిటీ) తగ్గుతుంది. వృద్ధులు, పిల్లలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడటంతో పాటు డస్ట్ వల్ల హృద్రోగాలు, ఆస్తమా ఇతర జబ్బులు వచ్చే అవకాశాలు మెండుగా ఉంటాయి. పేలుళ్లకు సమీప ప్రాంతంలోని ఊర్లలో జనం ఆయుర్థాయంపై తీవ్రప్రభావం పడనుంది. ప్రభుత్వాలు తమ ఆదాయం కోసం క్వారీలు, క్రషర్లకు అనుమతిస్తున్నాయి. కానీ, దాని వల్ల ఈ ప్రాంత జీవావరణం దెబ్బతినడమే కాకుండా మనిషి మనుగడకే ప్రమాదం పొంచి ఉన్నది. ఈ నేపథ్యంలో తమ మనుగడకు, ప్రకృతి పరిరక్షణకు ప్రజలు కార్యోన్ముఖులై నడుం బిగించాల్సిన అవసరం ఉంది. రిజర్వాయర్ చుట్టూ ఉన్న ప్రకృతి సంపదను, గుట్టల జోలికి అధికారులు రాకుండా.. అక్కడ ఎలాంటి క్వారీ, క్రషర్లు, ఇతర కార్యకలాపాలకు అనుమతి ఇవ్వకుండా పోరాడాల్సిన అత్యావశ్యకమైన సందర్భమిది. ప్రకృతిని రక్షించుకుంటేనే మానవాళి మనుగడ సాధ్యమనే మౌలిక సూత్రాన్ని అవగతం చేసుకుని ముందుకు సాగాల్సిన తరుణం ఏర్పడిందని, ఈ సమయంలో వెనుకడగు వేయొద్దని నిపుణులు సూచిస్తున్నారు.

## ప్రకృతిని ఆదాయ వనరుగా చూడొద్దు

**పిట్టల రవిబాబు, పర్యావరణవేత్త, ఓరుగల్లు**
**వైల్డ్ లైఫ్ సొసైటీ వరంగల్ సంయుక్త కార్యదర్శి**



ప్రభుత్వాలు ప్రకృతి సంపదను ఆదాయ వనరుగా చూడకూడదు. 'నీళ్లు, నిధులు, నియామకాలు' త్రయనినాదంతో ఏర్పడిన తెలంగాణలో ప్రకృతి విధ్వంసం కొందరు అక్రమార్కుల లాభం కోసం జరుగుతుండటం సరికాదు. ధర్మసాగర్ రిజర్వాయర్ చుట్టుపక్కల ఉన్న గుట్టల్లో క్వారీలు, క్రషర్లకు పర్మిషన్లు ఇవ్వడం సరికాదు. క్వారీల్లో పేల్చివేతల వల్ల స్థానికంగా ఉండే గ్రామాలకే కాకుండా ఇనుపరాతి గుట్టల్లో ఉన్న 'జలం, జంతుజాలం, వాటి ఆవాసాల మనుగడ'కు ప్రమాదం పొంచి ఉన్నది. అధికారులు వెంటనే క్వారీ పర్మిషన్లను రద్దు చేయాలి. కలెక్టర్, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు ఈ ప్రాంతంలో ఎలాంటి మైనింగ్ యాక్టివిటీస్ జరగకుండా మానిటర్ చేయాలి. తద్వారా మాత్రమే ఓరుగల్లుకు తాగునీరు, రైతాంగానికి సాగు నీరు అందించే ధర్మసాగర్ రిజర్వాయర్‌ను కాపాడుకోగలుగుతాం.

### ఇనుపరాతి గుట్టలను అభివృద్ధి చేస్తే..

## ప్రభుత్వానికి ఆదాయం

**సంగెకారి యువరాజు, దేవునూరు గ్రామస్తుడు**



క్వారీ, క్రషర్లలో పేల్చివేతలతో ధర్మసాగర్ రిజర్వాయర్‌కు ప్రమాదం పొంచి ఉన్నది. రిజర్వాయర్‌కు అతి దగ్గరలోనే పేలుళ్లు సంభవించడం వల్ల డేంజర్ పొంచి ఉన్నదని అధికారులు గుర్తించాలి. ప్రభుత్వం ఆదాయం కోసం క్వారీలు, క్రషర్లకు అనుమతించే బదులుగా.. రిజర్వాయర్ పరిసరాలను టూరిజ హబ్‌గా అభివృద్ధి చేస్తే మంచిది. లక్నవరం మాదిరిగానే టూరిజం గొప్పగా డెవలప్ అయ్యే అవకాశాలు దేవునూరు-ధర్మసాగర్ ప్రాంతానికి ఉన్నాయి. హనుమకొండకు అతి సమీపంలోనే ఉన్న ఈ రిజర్వాయర్‌కు.. 5. కి.మీ. దూరంలో ఇనుపరాతి గుట్టలు ఉన్నాయి. కాబట్టి ఈ గుట్టలను రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించి లేదా టూరిజం హబ్‌గా డెవలప్ చేసి.. ట్రెక్కింగ్.. ఇతర సౌకర్యాలు కల్పిస్తే.. చాలా మంది ప్రకృతి ప్రియులు ఈ ప్రాంత సందర్శనకు వస్తారు. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుంది. ఇకపోతే బ్లాస్టింగ్ వల్ల సమీప ప్రాంత రైతులు, ప్రయాణికులు, ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. క్వారీలు, క్రషర్ల వల్ల ప్రకృతికి మానవుడికి నష్టం కలుగుతున్నది.

# బీరన్న బోనాలకు ఘన చరిత్ర

వ్యాపించి ప్రజలు చనిపోతుండగా..ఆ సమయంలో ప్రజలందరూ కలసికట్టుగా బీరప్పకి పూజించి..ప్రజల ఆరోగ్యంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని బీరప్పకి వేడుకున్నారు. కురుమకుల ఆరాధ్య దైవమైన బీరప్ప స్వామికి పూర్వం తొలి ఏకాదశి రోజున రజాకారుల పాలనలో వారి అరాచకాలను ఎదుర్కొని కురుమ కులస్తులందరూ ఐక్యత చాటుతూ జాతీయ జెండాను దేవాలయం పై ప్రతిష్టించి స్వామివారికి బోనం సమర్పిస్తారు.

**– ప్రత్యేక ఆకర్షణగా బీరన్నలు**

1957 సంవత్సరం నుండి సైదాపూర్ మండల కరీంనగర్ జిల్లా కి చెందిన బీరన్నలు వస్తున్నారు. బీరన్నలు పసుపు, కుంకుమ రాసుకుని, చిప్పలు మోగిస్తూ తాళాలు వేసుకుంటూ, కత్తుల తో విన్యాసాలు చేస్తూ ఊరేగింపులో ముందుంటారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి తొలి ఏకాదశి ముందు రోజున బీరన్నలు కురుమ కులస్తుల ఇంటిపై బలి బలి అంటూ సరుగు చల్లుతారు.

**– బోనం ప్రత్యేకత**

బోనం అనేది ఒక మట్టి గిన్నె(పాత్ర)- అందులో అన్నం, పెరుగు, బెల్లం పెట్టి పూలతో అలంకరించి, తల మీద మోసి బీరన్న సమర్పిస్తారు.

**– బోనాల్లో ముఖ్యమైన ఘట్టం గావు**

కురుమ కుల పెద్దలు దయ్యాల వారు మరియు మండల వారు గంప లో బిరన్న స్వామి కళ్యాణానికి మరియు పట్నానికి కావాల్సిన బండారి, పచ్చ, కుంకుమ, తెల్ల పిండి, పల్లక, నిమ్మకాయలు, కళ్యాణం కోసం అబ్బాయి కి దయ్యాల వంశస్థులు, అమ్మాయికి మండల వంశస్థులు తరుపున ఆలయానికి తీసుకెళ్తారు. రామస్వామి గుడి నుండి మహిళలు అందరూ బోనమెత్తి ఊరేగింపుగా బురుజు సెంటర్ కి చేరుకుంటారు. ప్రత్యేక వేషధారణలో ఉన్న బీరన్నలు గావు పడుతారు. గొర్రె పిల్ల తలను కోరికి రక్తం చిందిస్తుండగా..భక్తులు గొర్రె పొట్టేలు రక్తాన్ని వీర తీలకంగా పెట్టుకోవడానికి యువకులు ఉత్సాహం కనబరుస్తారు. బోనాలతో ఉన్న మహిళలందరూ గావు పట్టిన గొర్రె పిల్లను దాటుతూ ఆలయానికి చేరుకుంటారు. మహిళలు



ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని బీరన్నకు మహిళలు కొత్త బట్టలు పెట్టి కొత్త కుండలో తెచ్చిన బోనాన్ని స్వామికి నైవేద్యంగా సమర్పిస్తారు.

వేద న్యూస్

ఆదివారం, జులై 06, 2025

# గ్రామ భద్రతకు కొత్త అడుగు

## - కడిపికొండలో విలేజ్ పోలీస్ ఆఫీసర్ల నియామకం

**వేద న్యూస్, మడికొండ :**

గ్రామ భద్రతకు మరింత బలాన్నిచ్చే దిశగా మడికొండ పోలీస్ స్టేషన్ కీలక కార్యక్రమాన్ని చేపట్టింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు కడిపికొండ శివాలయం వద్ద విలేజ్ పోలీస్ ఆఫీసర్(వీపీఓ) ప్రోగ్రామ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా ఐపీఎస్, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి హాజరై విలేజ్ పోలీస్ ఆఫీసర్లకు మార్గదర్శనం చేశారు. కార్యక్రమాన్ని మడికొండ సీఐ పి.కిషన్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాజ్ కుమార్ సమన్వయంతో ఏర్పాటు చేశారు. సీపీ ఆదేశాల మేరకు నియమించిన విలేజ్ పోలీస్ ఆఫీసర్లు స్థానిక గ్రామాల్లో శాంతి భద్రతల పర్యవేక్షణ, సమాచారం సేకరణ, పోలీసులకు ప్రజల మధ్య వంతెనలా పనిచేయనున్నారు. గ్రామస్థాయిలో నేరాల నివారణ, అవగాహన కల్పనకు వీరి పాత్ర కీలకమని అధికారులు పేర్కొన్నారు. మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కడిపికొండ, మడికొండ, రాంపేట, బట్టుపల్లి, కొత్తపల్లి, తరాలపల్లి, కుమ్మరిగూడెం గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ, గ్రామాల భద్రతను కాపాడేందుకు ప్రజలు పోలీస్ శాఖతో చేతులు కలిపి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.




# అవయవ దానంపై అవగాహన పెరగాలి

మొదటి పేజీ తరువాయి

సత్య శారద మాట్లాడుతూ అవయవ దానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. సమాజానికి మంచి చేయాలనే ఆలోచన కలగాలని, అవయవ దానంతో మరికొందరి జీవితాలలో వెలుగు నింపవచ్చునని, దీనిపై ప్రజల్లో ఇంకా అవగాహన కలగాలని చెప్పారు. అవయవదానం చేసిన వారు మహాత్ములని, చిరంజీవులుగా మిగిలిపోతారని సూచించారు.

ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో వైద్య విద్యార్థులు మానవ శరీరం పై ఫిజియా లజీ, అనటమి పరీక్షలు ఆచారాత్మకంగా చేయుటకు మానవ మృత దేహాల అవసరం ఎంతో ఉందని, మానవ మృత దేహాలు దానం చేయడం వల్ల వీటిని వినియోగించి మంచి వైద్యులను తయారు చేయ వచ్చునని కలెక్టర్ తెలిపారు. మనిషి చనిపోతే ఇక తిరిగి రారు, ఇక లేరు అనుకుంటారని, కానీ ఒక బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుండి 8 మందికి కొత్త జీవితాన్ని ఇస్తుందన్నారు. వేల మంది రోగులు తమకు అవసం మైన అవయవాలు సరైన సమయంలో లభించకపోవడంతో మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి రక్తదానం చేసే విధంగానే ప్రతి ఒక్కరూ అవయవనానికి సైతం ముందుకు రావాలని కోరారు. జీతే జీతే రక్తదానం జాతే జాతే నేత్రదాన్, దేహ్ దాన్ చేయాలన్నారు.

రోగిని బ్రతికించే వాళ్ళు డాక్టర్లు దేవతలైతే అవయవ దానం చేసిన వారు దైవదూతలన్నారు. అవయవ దానం పై అవగాహన కార్యక్రమాలను ఉధృతం చేయాలని కలెక్టర్ కోరారు. దాతలకు అవగాహన కల్పిస్తున్న వాలంటీర్లు, నిర్వాహకులు, అధికారులు వైద్య సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు, మాట్లాడుతూ అవయవ దానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. తాము కూడా వైద్య విద్యార్థులుగా విద్యానభ్యసించిన సమయంలో మానవ మృతదేహాలపై ప్రాక్టికల్ గా పరీక్షలు నిర్వహించడం వల్ల ఈరోజు సమాజంలో రోగులకు పరిపూర్ణంగా శస్త్ర చికిత్సలు చేయగలుగుతున్నామన్నారు. నేటి వైద్య విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ గా శస్త్ర చికిత్సలు నేర్పడానికి మానవ పార్థివ దేహాలు ఎంతో అవసరమని అన్నారు. అవయవ దానం చేయుటకు అంగీకరించడం,

బ్రెయిన్డెడ్ అయిన వారి శరీరాలను ముందుకు వచ్చి మెడికల్ కాలేజీలకు ఇవ్వడం మంచి పరిణామం అని, దీని ద్వారా గొప్ప డాక్టర్లను తీర్చిదిద్దడం తో పాటు దైవం కూడా అనుగ్రహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా అవయవ దానం చేయుటకు అంగీకరించిన వారికి శాలువాలతో కలెక్టర్ సత్కరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సాంబశివరావు, కేఎంసీ, ఎంజీఎం నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ లు డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, డాక్టర్ చిలుక మురళి, డాక్టర్ మోహన్ దాస్, డాక్టర్ కూరపాటి రమేష్, ప్రభుత్వ సూపర్డెంట్ డాక్టర్ భరత్ కుమార్, మైదం రాజు, తహసీల్దార్ ఇక్బాల్, నిర్వాహకులు, వాలంటీర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# నిబద్ధతకు నిలువెత్తు రూపం 'గౌస్'

- సమస్యపై వెంటనే స్పందన
- క్షేత్రస్థాయిలో పర్యటించి ఇష్యూకు పరిష్కారం
- నిరుపేద ఫిజికల్లీ చాలెంజ్డ్ విద్యార్థిని పట్ల ఆఫీసర్ ఔదార్యం
- డీఎండబ్ల్యూవో గౌస్ హైదర్ తీరు పట్ల ప్రశంసల వెల్లువ




**వేద న్యూస్, హనుమకొండ:**

హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిగా గౌస్ హైదర్ బాధ్యతలు చేపట్టిన వారం రోజులకే విధుల పట్ల తన నిబద్ధతను చాటుకున్నారు. ఏదైనా సమస్య ఉందని ఒక అధికారి దగ్గరికి వెళ్తే.. తన కిందిస్థాయి అధికారులకు ఆ పని అప్పజెప్పి.. ఎలాంటి రిస్క్ తీసుకోకుండా కేవలం ఆఫీసులో కూర్చుని సంతకాలకే పరిమితమైన కొంతమంది పెద్ద స్థాయి అధికారులు ఉన్న ఈ రోజుల్లో.. తాను అందుకు భిన్నం అని నిరూపించుకున్నారు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి గౌస్.

**- దగ్గరుండి అడ్మిషన్ ఇప్పించిన ఆఫీసర్**

హనుమకొండ జిల్లాలోని కమలాపూర్ మండల కేంద్రంలో ఓ విద్యార్థిని అనారోగ్య సమస్య కారణంగా తన రెండు కాళ్లకు ఇబ్బంది ఉండటంతో పాఠశాలకు కుంటుతూనే వెళ్తోందని, ఆమె ఇబ్బందులను వివరిస్తూ 'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో ప్రచురించిన కథనానికి అధికారి గౌస్ వెంటనే స్పందించారు. సదరు ఆఫీసర్.. 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడి విద్యార్థిని వివరాలు అడిగి తెలుసుకోవడమే కాకుండా..అదే రోజు క్షేత్రస్థాయి పర్యటనకు రావడం విశేషం. సదరు విద్యార్థిని సబ్జాన్ ఇంటి వద్దకు మైనారిటీ హాస్టల్‌కు సంబంధించిన టీచర్స్‌ను వెంటబెట్టుకొని.. విద్యార్థిని ఇంటికి స్వయంగా తన కారులో వెళ్లారు. విద్యార్థిని కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి అవగాహన కల్పించారు. అక్కడే మైనార్టీ హాస్టల్‌లో సీటు ఇస్తున్నట్లు హామీ ఇచ్చి.. ఆ మరుసటి రోజు మైనార్టీ హాస్టల్‌కు విద్యార్థినిని రమ్మని చెప్పారు. అంతటితోనే తన విధులు అయిపోయాయని ఆఫీసర్ గౌస్ అనుకోలేదు. స్వయంగా ఆయనే దగ్గరుండి మరి సబ్జాన్‌కు అడ్మిషన్ ఇప్పించి.. స్కూల్ యూనిఫాం, బ్యాగ్, బుక్స్, బ్లాంకెట్స్ తన చేతుల మీదుగా విద్యార్థినికి అందజేశారు. అనంతరం హాస్టల్‌లో విద్యార్థులందరితో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఒక జిల్లా స్థాయి అధికారి తన దృష్టికి సమస్య వచ్చిన వెంటనే స్పందించి ఆ సమస్యకు పరిష్కారం చూపాడంటే ఆ అధికారికి తన వృత్తి పట్ల, విధుల పట్ల ఎంత నిబద్ధత ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా స్థాయి అధికారి ఇష్యూపై స్పందించిన తీరు పట్ల ప్రజలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. నిరుపేద విద్యార్థిని సబ్జాన్ కుటుంబ సభ్యులు అధికారి గౌస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమాజానికి ఏదో చేయాలని తపన ఉన్న వారే సమస్యలు ఎదురైనప్పుడు ఇలా త్వరితగతిన స్పందిస్తారని, సమస్యలకు పరిష్కారం చూపుతారని పలువురు డీఎండబ్ల్యూవో గౌస్ హైదర్‌కు అభినందనలు తెలిపారు.

# ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగాన్ని ఇప్పించండి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ నియోజకవర్గంలోని వీర్లపాలెం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్లో లో ప్రతి కుటుంబానికి ఉద్యోగాన్ని ఇవ్వాలని ఉపాధి భరోసా కొరకు, సమస్యలు విన్నవించుకొనుటకు 1000 కుటుంబాల తో కలెక్టర్ ను కలవటానికి శనివారం నల్లగొండ కలెక్టర్ ఆఫీస్ కి వెళ్లి కలెక్టర్ ను అనుమతి కోరిన వీర్లపాలెం గ్రామస్థులు. అంత మంది నల్లగొండ కలెక్టరేట్ ఆఫీస్ కి రావటం కంటే నేనే వీర్లపాలెం గ్రామం వచ్చి మీ సమస్యలు తెలుకుంటా అని హామీ ఇచ్చిన కలెక్టర్ ఇలా త్రిపాఠి. త్వరలోనే ఎప్పుడు వస్తానో చెబుతా అని హామీ ఇవ్వడం జరిగింది.. ఈ కార్యక్రమం లో గ్రామస్తులు పాతులోతు శ్రీను నాయక్,సామాజిక వేత్త కొండ లక్ష్మణ్ గౌడ్,నాలి నాగరాజు,గుగులోతు వెంకటేశ్వర్లు,ధనవత్ శ్రీను నాయక్ తతిదరులు పాల్గొన్నారు.

## తైక్వాండో చాంపియన్స్‌కు

# అభినందన



**వేద న్యూస్, చొప్పదండి :**

జూన్ నెల 23 నుండి 25వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్ లో జరిగినటువంటి జూనియర్ తైక్వాండో ఛాంపియన్షిప్ లో కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణానికి చెందిన పడకంటి కాశివిశ్వనాథ్, బుసారపు వెంకటేష్ గౌడ్, స్పందన, సౌమ్య, రాంచరణ్, విద్యార్థులు తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించి 7 గోల్డ్, 1 సిల్వర్, 1 రజత పథకాలు సాధించిన విద్యార్థులను కేంద్ర మంత్రి బండి సంజయ్ శాలువాతో సన్మానించి అభినంది ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని, మన పార్లమెంట్ పరిధిలోని చొప్పదండి పట్టణ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. నేటి విద్యార్థులు కష్టపడి బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ కరీంనగర్ పార్లమెంట్ పరిధి లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరికి ఉచితంగా సైకిల్ లను 8,9 తేదీల్లో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు చిల్ల శ్రావణ్, కోచ్ శ్రీగాధ సంతోష్, నేషనల్ రేపరి రమ్య మరియు పిల్లల తల్లిదండ్రులు పడకంటి రాజు, శ్రీగాధ లక్ష్మన్, బుసారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్‌కు మోదీ తలొగ్గుతారు

**వేద న్యూస్, డెస్క్:**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. భారత్-అమెరికా ట్రేడ్ డీల్ విషయంలో ప్రధాని మోదీ.. అధ్యక్షుడు ట్రంప్ ముందు లొంగిపోతారని వ్యాఖ్యానించారు. 'అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలకు ప్రధాని మోదీ తలొగ్గుతారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం తప్ప ఏమీ చేయలేరు. నా మాటలు నమ్మకపోతే రాసిపెట్టుకోండి' అని రాహుల్ వ్యాఖ్యానించారు. భారత ఉత్పత్తులపై అమెరికా ఇప్పటికే 10 శాతం టారిఫ్ విధిస్తున్న విషయం తెలిసిందే. అయితే, అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రంప్ భారత్ సహా పలు దేశాలపై అదనపు సుంకాలను ప్రకటించారు. ఏప్రిల్ 2న మన దేశంపై ట్రంప్ 26 శాతం అదనపు సుంకాన్ని విధిస్తున్నట్లు ప్రకటించారు. అయితే, అదనపు సుంకాలను జులై 9 వరకూ నిలిపివేస్తున్నట్లు ట్రంప్ యంత్రాంగం గతంలోనే ప్రకటించింది. అంతలోపు ఆయా దేశాలు మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంటుంది. లేదంటే, జులై 9 నుంచి అదనపు సుంకాలు వడ్డిస్తారు. అంతలోపే వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరు దేశాలూ భావిస్తున్నాయి. ఈ అదనపు 26 శాతం సుంకం నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని భారత్ కోరుతోంది.

మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాలూ తీవ్రంగా చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చలు చివరి దశకు వచ్చినట్లు ఇటీవలే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. వాణిజ్య ఒప్పందంలో ఇరు దేశాలూ వ్యవసాయం, ఆటోమొబైల్స్, ఇండస్ట్రియల్ గూడ్స్, లేబర్ ఇంటెన్సివ్ ప్రొడక్ట్‌లపైనే ఎక్కువగా దృష్టి పెట్టాయి. దేశంలో అధిక ఉపాధి కల్పించే తమ ఎగుమతులపై సుంకాలను గణనీయంగా తగ్గించాలని భారత్ ప్రతిపాదిస్తోంది. ముఖ్యంగా వస్త్రాలు, పాదరక్షలు, తోలు ఉత్పత్తుల ఎగుమతులపై అర్థవంతమైన రాయితీల కోసం భారత్ ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. వ్యవసాయం, డెయిరీ రంగాల్లోనూ తమ ఉత్పత్తులకు పూర్తిస్థాయి మార్కెట్ ప్రవేశం కల్పించాలని అమెరికా డిమాండ్ చేస్తోంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073